సాక్షి గుంటూరు

ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



సాతులూరులో వైద్యశిబిరం

నాదెండ్ల: సాతులూరు జెడ్పీ హైస్కూలులో శనివారం బాపట్ల కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు.



వైభవంగా అయ్యప్ప పడి పూజ

చుండూరు(వేమూరు): మండలంలోని చిన పరిమిలో కొలువైన శ్రీ గంగా పార్వతీ శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి పడి పూజ వైభవంగా నిర్వహించారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



నత్రశాల(రెంటచింతల): నత్రశాలలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవ స్థానం ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామికి శని వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థులు జీవితంలో ఎదగాలి



మేడికొండూరు: మండల కేంద్రమైన మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ – టీచర్స్ సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పాల్గొన్నారు. డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. గతంలో ఇలాంటి కార్యక్రమాలు జరగలేదన్నారు. విద్యార్థులు స్టేజీ ముందు కాక స్టేజీపై కూర్చునే స్థాయికి ఎదగాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ.. హాజరు శాతాన్ని బట్టి ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ర్యాంకింగ్ ఇచ్చే ఏర్పాటు చేశారని చెప్పారు. విద్యార్థులు ఆదర్శంగా పెరిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, డీఈవో రేణుక, డీఎంహెచ్ఓ కొర్రా విజయలక్ష్మి, మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, సర్పంచ్ పూల నాగమణి, ప్రధానోపాధ్యాయురాలు జయప్రద, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం పథకం అమలు చేయాలి



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. తహసీల్దార్ సునీత, ఎంపీడీవో భార్గవి, ఎంఈవో-1 శ్రీనివాసరావు, ఎంపీపీ షేక్ జబీనా, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ విచ్చేశారు. ఈ సందర్భంగా మేకతోటి అరుణ మాట్లాడుతూ... గత ప్రభుత్వం గవర్నమెంట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఐక్యరాజ్యసమితి వేదికల్లో మాట్లాడే అవకాశం కల్పించిందని, అది చాలా గొప్ప విషయం అన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆర్థికంగా భరోసా కల్పించిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనం పథకం అమలు చేయాలని కోరారు. అంతలో అత్యుత్సాహం చూపిస్తూ ఎంఈవో-2 కాజ లక్ష్మీనారాయణ స్పందించారు. రాజకీయాలు మాట్లాడ వద్దంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. పాఠశాలలో అభివృద్ధి పనులను రాజకీయాలు చేస్తున్నది అధికారులే అని, ఒక మహిళనైన తనను పలు సందర్భాలలో గౌరవించకపోవడం గురించి ఆమె నిలదీశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు వివిధ శాఖల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఏఎన్‌యూలో ఎల్‌ఎల్‌బీ స్పాట్ అడ్మిషన్లు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్ర విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్, బీబీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ కోర్సులకు ఈ నెల 9వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. యూనివర్సిటీ అడ్మిషన్‌ల డైరెక్టర్ డాక్టర్ పి.బ్రహ్మాజీ రావు ఈ విషయాన్ని శనివారం తెలిపారు. ప్రవేశాలకు ఇంటర్మీడియట్ అర్హత ప్రామాణికం అన్నారు. నేరుగా అడ్మిషన్ కార్యాలయానికి వచ్చి ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. ఏపీ లాసెట్ రాయని వారికి కూడా అర్హత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

'వాటర్ హీరో'కు అవార్డు ప్రదానం



తెనాలి: దేశంలో జల సంరక్షణ, వాననీటి సేకరణ, గ్రామీణ అభివృద్ధి రంగాల్లో గణనీయమైన కృషి చేసిన వ్యక్తులకు గౌరవంగా ఇచ్చే గ్లోబల్ వాటర్ ట్రాన్స్‌పర్సాలిటీ అవార్డు-2024ను తెనాలికి చెందిన 'వాటర్ హీరో' డాక్టర్ పాదిలి రాజశేఖరరాజు స్వీకరించారు. కేంద్రప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఇండియా వాటర్ ఫౌండేషన్ నిర్వహణలో ఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో శుక్రవారం సాయంత్రం ముగింపు సభ జరిగింది. ఇందులో రాజశేఖరరాజు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి అవార్డును ప్రదానం చేశారు.

ఇక్కడా పచ్చపాతమే!

పేరెంట్స్- టీచర్స్ సమావేశంలో ప్రొటోకాల్‌పై అధికారుల అలసత్వం



సంజీవయ్యనగర్ పినపాటి ప్రభుదాస్ స్కూల్‌లో కుర్చీలు లేక విద్యార్థుల తల్లిదండ్రుల అవస్థలు

- స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు ఆహ్వానమూ కరువే
- టీడీపీ నాయకులకే ప్రాధాన్యం
- హెచ్‌ఎంను నిలదీసిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్
- కనీస వసతుల కల్పనలోనూ విఫలం



కొత్తపేట జలగం రామారావు హై స్కూల్‌లో మైక్ సెట్‌ను ఆపరేట్ చేస్తున్న విద్యార్థులు

నెహ్రూనగర్: ప్రభుత్వం మారగానే అధికారులు కూడా తీరు మార్చారు. తమ స్వామి భక్తిని ప్రభుత్వ కార్యక్రమాల్లో బాహాటంగానే చూపించారు. పేరెంట్స్- టీచర్స్ సమావేశాలు ఇష్టానుసారంగా నిర్వహించారు. రాజకీయాలకు సంబంధాలు లేకుండా మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ శనివారం నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కూటమి నేతల మెప్పు పొందేందుకు రాజకీయ కార్యక్రమంగా కొంత మంది విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవర్తించారు. స్థానిక ప్రజాప్రతినిధులైన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు కనీసం సమాచారం ఇవ్వకుండా.. కొందరికి అప్పటికప్పుడు నామమాత్రంగా చెప్పి చేతులు దులుపుకొన్నారు. వారు లేకుండా కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవడంపై విద్యాశాఖ సిబ్బందిపై పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు అవమానం

గుంటూరు తూర్పు నియోజకవర్గం సంజీవయ్యనగర్ పినపాటి ప్రభుదాస్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ మల్లవరపు రమ్య ఉన్నా.. ఆమెకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. శనివారం ఉదయం హడావుడిగా సమాచారం అందించి... ఇవాళ మీటింగ్ ఉందని , రావాలని పేర్కొన్నారు. దీంతో కార్పొరేటర్ రమ్య స్కూల్‌కి వెళ్లడంతో అక్కడ టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థి ఉన్నారు. దీంతో ఆమె నిర్ఘాంతపోయారు. ఆ పక్క డివిజన్ టీడీపీ కార్పొరేటర్‌ను స్కూల్‌కి రావాలని ఆహ్వానించడంతో ఆమె కూడా వచ్చేందుకు ప్రయత్నం చేయడంతో స్థానిక కార్పొరేటర్ రమ్య పాఠశాల ప్రధానోధ్యాయురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధిగా తాను ఉంటే టీడీపీ నాయకులను ఎందుకు పిలిచారని ప్రశ్నించారు. ఇది తనను పిలిచి అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం వరకు స్కూల్‌లోనే ఉన్నప్పటికి ఎటువంటి సమావేశం లేకుండానే విద్యార్థులు తల్లిదండ్రులు వెళ్లిపోతున్నారని, ఈసారి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పి తనని పాఠశాల హెచ్ఎం పంపించి వేయడం ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం టీడీపీ నాయకుల మెప్పుకోసమే తనని ఇలా ఇబ్బంది పెట్టారని రమ్య ఆరోపించారు. వెంగళరావునగర్‌లో మీటింగ్‌కు మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి హాజరయ్యారు. కార్పొరేటర్ దూపాటి వంశీ లేకుండానే కార్యక్రమాన్ని ముగించేశారు.

కనీస సౌకర్యాలూ కరువు

విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిసి ప్రభుత్వం ముందుగానే తగిన ఏర్పాటు చేసుకోవాలని విద్యాశాఖను ఆదేశించింది. కానీ విద్యాశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. కనీసం విద్యార్థుల తల్లిదండ్రులు కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు కూర్చునే బెంచీల మీద, గోడలపై వారు కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్తపేట జలగం రామారావు హైస్కూల్‌లో విద్యార్థులతో మైక్ సెట్ పెట్టించుకోవడం, పట్టాలు వేయించడంవంటి కార్యక్రమాలు చేయించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ సిబ్బందిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి మీటింగ్‌లు పెట్టకపోతే ఏంటి అని బహిరంగంగా చర్చించుకుంటూ వెళ్లిపోయారు.

చదువుకున్నవారు పిల్లల్ని కనడం లేదు



బాపట్ల మున్సిపల్ పాఠశాలలో ముగ్గులు తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

- పాపులేషన్ మేనేజ్‌మెంట్ అమలు చేయాలి
- మెగా పేరెంట్స్ – టీచర్స్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ప్రతి ఆడబిడ్డ ఇద్దరికి తక్కువకాకుండా పిల్లలకు జన్మనివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం బాపట్ల మున్సిపల్ పాఠశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల మెగా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తగ్గుతున్న జనాభాకు అనుగుణంగా ఆడబిడ్డలు ఎక్కువమందికి జన్మనివ్వాలని మరోమారు చెప్పారు. ప్రస్తుతం దేశంలో జనాభా ఉత్పత్తి 1.9 శాతం మాత్రమే ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది 1.7 శాతం ఉండగా బాపట్లలో 1.45 శాతానికి పడిపోందన్నారు. జనం లేకపోతే ఊరుకూడా ఉండదన్నారు. దీనిని బట్టి చూస్తే జనాభా మరింతగా తగ్గిపోతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి తాను 2019లో చెబితే అందరూ ఎగతాళి చేశారన్నారు. ఇప్పుడు అందరూ ఫ్యామిలీ ప్లానింగ్ చేసుకొని ఒక్కబిడ్డకే పరిమితమవుతున్నారన్నారు. కొందరు చదువుకున్నవారు అసలు పిల్లలనే కనడం లేదన్నారు. ఆదాయం రెండింతలుగా పెరిగినా ఖర్చు పెట్టుకొని ఎంజాయ్ చేస్తున్నారు తప్పించి పిల్లల్ని కనడంలేదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే 2047 నాటికి దేశంలో, రాష్ట్రంలో కేవలం వృద్ధులు మాత్రమే మిగులుతారని, వారు మరణించాక ఎవరూ ఉండరన్నారు. అందుకే ప్రతి ఆడబిడ్డ ఇద్దరికి తగ్గకుండా బిడ్డలను కనాలన్నారు. చైనా, జపాన్, కొరియా, యూరోప్‌లలో పిల్లలు లేరన్నారు. అక్కడ చిన్నపిల్లలకు బదులు బొమ్మలు మాత్రమే ఉంటున్నాయన్నారు. అందుకే ముందు జాగ్రత్తగా అందరూ పిల్లల్ని కనాలన్నారు. బాపట్ల నుంచి పిలుపునిస్తున్నా.. ఇక నుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ అమలు చేయాలన్నారు.

చంద్రబాబు మాటలకు ఘొల్లుమన్న జనం

చంద్రబాబు మాటలకు సమావేశానికి వచ్చిన పురుషులతోపాటు మహిళలు సైతం పలుమార్లు నవ్వుకున్నారు. ఐటీ తాను పెట్టిందేనని చంద్రబాబు మరోమారు చెప్పారు. తాను ఐటీని తీసుకురావడంవల్లే హైదరాబాద్ అభివృద్ధి సాధించిందన్నారు. తాను ఆలోచించిన తర్వాతే సెల్‌ఫోన్‌లు వచ్చాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన టెక్నాలజీ, అభివృద్ధి మొత్తం తాను తెచ్చిందేనని చంద్రబాబు చెప్పడంపై సభికులు వ్యంగ్యంగా చర్చించుకోవడం కనిపించింది. తొలుత ఉదయం 11గంటల ప్రాంతంలో బాపట్ల మున్సిపల్ పాఠశాలకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో కలిసి పాఠశాలను పరిశీలించారు. కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులు వేసిన ముగ్గులను పరిశీలించారు. బాపట్ల మున్సిపల్ పాఠశాలలో సమావేశం అనంతరం విద్యార్థులతో కలిసి సీఎం చంద్రబాబు, లోకేష్‌లు భోజనం చేశారు. ఆ తర్వాత లోకేష్ ఇద్దరి ప్లేట్లను తీసుకొని వెళ్లారు.

వీర జవాన్ల రుణం తీర్చుకుందాం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



ఫ్లాగ్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తదితరులు

గుంటూరు వెస్ట్ : దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన జవాన్ల కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ఫ్లాగ్ డే కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... ఫ్లాగ్ డే సందర్భంగా విడుదల చేసిన స్టిక్కర్లను ప్రతి ఒక్కరు కొనుగోలు చేసి అమర జవాన్ల కుటుంబాలకు అండగా నిలవాలని తెలిపారు. సరిహద్దును కాపాడడం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన సైనికుల గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. మనం కొనుగోలు చేసే స్టిక్కర్ల నగదు యుద్ధ వితంతువులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం యుద్ధ వితంతువులు బుడ్డపు వెంకట లక్ష్మి (భర్త హవల్దార్ పారది రెడ్డి – శౌర్య చక్ర), చిట్టిమడుగుల నవీనలను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. బుడ్డపు వెంకటలక్ష్మికి ఏటుకూరు గ్రామంలో 300 చ.గ. ఇంటి స్థలానికి సంబంధించిన పట్టాను అందజేశారు. ఫ్లాగ్ డే స్టిక్కర్లను కలెక్టర్‌తోపాటు జేసీ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి కొనుగోలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి ఆర్.గుణశీల, సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ వధువు.. తెనాలి వరుడు..



పెళ్లిపీటలపై వధూవరులు అవినాష్-క్రిస్టినా

వివాహంతో ఒక్కటైన ప్రేమజంట

తెనాలి: ప్రేమకు కులమతాలే కావు... ఎల్లలు కూడా లేవని డెల్టాలోని పలువురు ఎన్నారైలు చాటుతున్నారు. దేశం కాని దేశంలో చిగురించిన ప్రేమతో స్వస్థలంలో కుటుంబసభ్యులు, బంధుమిత్రుల మధ్య పెళ్లిబాజాల హోరులో ఒక్కటి అవుతున్నారు. సంప్రదాయాలను ఆచరిస్తూ తమ ప్రేమను పరిపూర్ణం చేసుకుంటున్నారు. ఆ క్రమంలోనే శనివారం తెనాలికి చెందిన అవినాష్, గ్రీస్ దేశానికి చెందిన క్రిస్టినా మూడుముళ్ల బంధంతో దంపతులయ్యారు. స్థానిక చెంచుపేటలోని కళ్యాణమండపం ఇందుకు వేదికైంది. పట్టణంలోని గంగానమ్మపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పేరుబోయిన ఆంజనేయులు-నాగజ్యోతి కుమారుడు అవినాష్ బీటెక్ చేశాక, ఐర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. గ్రీస్ యువతి క్రిస్టినా కూడా అక్కడే కొలువులో ఉన్నారు. వీరి పరిచయం ప్రేమకు దారితీసింది. పెళ్లితో నూరేళ్లు కలిసి జీవించాలని నిర్ణయం తీసుకున్నారు. తమ మనోభావాన్ని పెద్దలకు తెలియజేశారు. వారు సంతోషంగా అంగీకరించారు. పెద్దలు నిశ్చయించిన సుముహూర్తానికి శనివారం వీరి వివాహం వైభవంగా జరిగింది. క్రిస్టినా తల్లి లొకియా మెరిస్వరటౌతో పాటు సోదరి కూడా హాజరయ్యారు.



స్నాతకోత్సవంలో పట్టాలు అందుకున్న ఆనందంలో విద్యార్థులు

విద్యకు జగతిని మార్చే శక్తి

- నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య శ్రీకృష్ణ దేవరావు
- విజ్ఞాన్ వర్సిటీలో ఘనంగా 'ఆన్‌లైన్ ఎడ్యుకేషన్' 2వ స్నాతకోత్సవం



వేడుకలో ఆచార్య శ్రీకృష్ణ దేవరావు, లావు రత్తయ్య, లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

చేబ్రోలు: ప్రపంచాన్ని మార్చే శక్తి ఒక్క చదువుకే ఉందని అందరూ గుర్తించాలని హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఆన్‌లైన్ ఎడ్యుకేషన్' 2వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సమాజానికి సేవ చేసేందుకు తమ నైపుణ్యం, జ్ఞానం ఉపయోగించాలని సూచించారు. ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు మాట్లాడుతూ... గ్రామీణ విద్యార్థులను తీర్చిదిద్దడంలో విశ్వవిద్యాలయం కృషి అభినందనీయం అన్నారు. జీవితంలో డిగ్రీ అనేది మైలురాయి మాత్రమేనని, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి ఆసక్తి, ప్రేరణ ఉంటే చాలని పేర్కొన్నారు.

860 మందికి డిగ్రీలు ప్రదానం

విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ... ఎంబీఏలో 670, ఎంసీఏలో 190 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం డిస్టెన్స్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ విధానం మానవాళి విప్లవాత్మకంగా ఎదగడానికి కారణం అవుతోందన్నారు. డిస్టెన్స్ విద్యార్థులు తమ త్యాగాలు, క్రమశిక్షణ, నిరంతర పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ఈ లక్ష్యాన్ని సాధించగలిగినట్లు పేర్కొన్నారు. ఇది 'ట్రాన్స్‌ఫర్ లెర్నింగ్' అనే భావనకు ఆధారంగా ఉంటుందన్నారు. సాధించిన ఈ విజయం ఆత్మవిశ్వాసాన్ని, నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు.

సమాజానికి తిరిగి ఇవ్వాలి

విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ... విద్యార్థులు జీవితంలో స్థిరపడ్డాక సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు. ఆన్‌లైన్‌లో ఎంబీఏను చేయడమంటే మరింత నిబద్ధత అవసరం అన్నారు. వ్యాపార ప్రపంచం టెక్నాలజీ, స్థిరత్వం, ఆవిష్కరణల ద్వారా ఎన్నడూ లేని వేగంతో అభివృద్ధి చెందుతోందన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వ్యక్తిగత జీవితంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆన్‌లైన్‌లో డిగ్రీ కోర్సును పూర్తి చేయడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, ఆయా విభాగాల డీన్లు, సీడీఓఈ డైరెక్టర్లు, స్నాతకోత్సవ కన్వీనర్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర దక్కేలా చర్యలు

సాక్షి ఎఫెక్ట్



సీఎస్‌డీటీ వెంకట్రావును ప్రశ్నిస్తున్న డీఎస్‌ఓ

పొన్నూరు: రైతు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం అందించే మద్దతు ధర లభించేలా అధికారులు పనిచేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని వీడాలని గుంటూరు డీఎస్ఓ కోమలి పద్మ హెచ్చరించారు. ఈ నెల 5వ తేదీన ధాన్యం విక్రయాలకు సంబంధించి రైతులు పడుతున్న కష్టాలను చెబుతూ ఈ నెల 5వ తేదీన అన్నదాత ఆశలు ఆ'వరి'! శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఎస్ఓ స్పందించారు. శనివారం పొన్నూరులోని రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో మండల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను సీఎస్‌డీటీ వెంకట్రావును అడిగారు. ఆయన వద్ద ధాన్యం విక్రయాలకు సంబంధించి సమగ్ర సమాచారం లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్ఓ మాట్లాడుతూ మద్దతు ధర ప్రతి రైతుకు అందాలని, దళారుల బారిన పడి తక్కువ ధరకు ధాన్యం విక్రయించి ఏ ఒక్కరూ నష్టపోకూడదని అన్నారు. ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని డీఎస్ఓ తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, డీటీ రాజా రమేష్, ఆర్ఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,700 గరిష్ఠం : రూ. 3,500

మోడల్ ధర రూ. 3,100

డాక్టర్ అంజయ్యకు విశ్వగురు జాతీయ పురస్కారం



గుంటూరు మెడికల్: విశ్వ గురు వరల్డ్ రికార్డ్ సంస్థ జాతీయ స్థాయి కామధేను అవార్డుకు గుంటూరుకు చెందిన డాక్టర్ అంజయ్యను ఎంపిక చేసింది. వైద్య రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బందెల అంజయ్య కర్నూలు జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ఒంగోలు రిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్‌గా పని చేశారు. ప్రస్తుతం కాటూరి మెడికల్ కాలేజీలో గౌరవ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన రాసిన వైద్య గ్రంథాలలో క్లీనికల్ పీడియాట్రిక్, క్లీనికల్ పీడియాట్రిక్ కార్డియాలజీ, క్లీనికల్ మెథడ్ ఇన్ పీడియాట్రిక్ తదితరాలు ఉన్నాయి. గతంలో మదర్ థెరిస్సా మెమోరియల్ అవార్డు, గ్రంథాలయ అవార్డు, ఏడు సార్లు బెస్ట్ డాక్టర్ అవార్డు, రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్ అవార్డు, గత నెల 4న గుంటూరులో జరిగిన పట్టాభి కళాపీఠం అవార్డు అందుకున్నారు. ఈ నెల 8న హైదరాబాద్‌లోని బేగంపేట టూరిజం ప్లాజాలో విశ్వగురు వరల్డ్ రికార్డు సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు చేతుల మీదుగా డాక్టర్ బందెల అంజయ్య అవార్డు అందుకోనున్నారు. డాక్టర్ అంజయ్యను గుంటూరు పట్టాభి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తుములూరి రాజేంద్రప్రసాద్, ఎయిల్ రివైవల్ ఫోరమ్ సభ్యులు నిరీక్షణ రావు, శిఖామణి, సుధాకర్, రాజు, ప్రసన్నబాబు, భానురంజిత్, ఏలియా తదితరులు అభినందించారు.

వెండితెరపై తెనాలి స్వరాల ఝరి !

- సినిమా సంగీతంలో తెనాలి వారసుడు ఎస్‌కే బాజీ
- కీబోర్డు ప్లేయరుగా ఆరంభించి సంగీత దర్శకుడిగా ప్రస్థానం
- నేడు ఘంటసాల స్వరాభిషేకంలో సత్కారానికి ఏర్పాట్లు

తెనాలి: తెలుగు సినిమాను సుసంపన్నం చేసిన వారిలో తెనాలికి చెందిన ఎందరో ఉన్నారు. నటీనటులే కాదు... సాంకేతిక నిపుణులూ తెరవెనుక సినిమా కళకు వన్నెలు దిద్దారు. ఉజ్వలంగా వెలిగేలా చేశారు. ఆ వారసత్వం నేటికీ కొనసాగుతోంది. సంగీతంలోనూ కొత్త తరం వస్తోంది. సినిమా సంగీతానికి కొత్త నడకలు నేర్పించిన నాటి బీఎన్నార్ వారసులూ వస్తున్నారు. వారిలో ఎస్‌కే బాజీ ఒకరు. అమర గాయకుడు ఘంటసాల 103వ జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం తెనాలిలో జరగనున్న 'స్వరాభిషేకం'లో ఎస్‌కే బాజీని సినీ మాటల మాంత్రికుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా చేతులమీదుగా సత్కరించనున్నారు.

వరుసగా అవకాశాలు

ఆధ్యాత్మిక గీతాలే కాదు... సూపర్‌హిట్ పాటలకూ అంతా బాజీకేసి చూడసాగారు. ఆ క్రమంలోనే 2018లో ప్రముఖ గాయని మంగ్లీ ప్రైవేటు గీతాలకు సంగీత సహకారం అందించారు. మంగ్లీ సంక్రాంతి పాట సూపర్ హిట్టయింది. అవకాశాలు వరుస కట్టాయి. మధుప్రియ, బిత్తిరి సత్తిరి, గీతా మాధురి, మాళవిక పాటలకు సంగీతం ఇస్తూ వచ్చారు. మంచి గుర్తింపు రావటంతో మోహన భోగరాజు సంప్రదించారు. ఆమె చేసిన 'నీ బుల్లెట్టు బండెక్కి వస్తా' పాట ఎంత హిట్టయిందో తెలిసిందే. మూడేళ్లలో 45 కోట్ల మంది ఆ పాటను యూట్యూబ్‌లో చూశారు. ఎంతోమంది అభినయించి, సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పెట్టారు.



తన స్టూడియోలో ఎస్‌కే బాజీ

అలాంటి కవర్ సాంగ్స్‌ను మరో అయిదు కోట్లమంది చూశారు. ఆ పాటకు సంగీతం అందించిన ఎస్‌కే బాజీ మరింత పాపులరయ్యారు. ఆ తర్వాత 'మా ఊరి సినిమా', 'జస్ట్ మినిట్' సినిమాలకు సంగీతం సమకూర్చారు. మరోవైపు లోకల్ సెలబ్రిటీస్, ఎన్నారైలకూ కమర్షియల్ వర్క్స్, ఆధ్యాత్మిక ఆల్బమ్స్ కొనసాగిస్తూ బిజీగా ఉన్నారు. 'ఊరి నుంచి వచ్చేటప్పుడు నా దగ్గర రూపాయి లేదు... ఇటీవలే రూ.కోటిన్నరతో కొత్త ఇల్లు తీసుకుని 'ఏఎంఎం స్టూడియో'నూ అందులోనే ప్రారంభించాను' అని చెప్పారు బాజీ. 'కడప దర్గాను దర్శించుకున్న తర్వాత అక్కడి గురువుల ఆశీర్వాదంతోనే ఇంతవరకూ రాగలిగాను... మంచి సంగీత దర్శకుడిని అనిపించుకోవాలని నా కోరిక' అని ఆయన అన్నారు.

చిన్ననాటి నుంచే...



'తెనాలి మస్తాన్ ఫుల్ బ్యాండ్' పేరు ఎంతో పేరొందిన విషయం తెలిసిందే. వివాహాది శుభకార్యాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంగీతం ఎక్కువగా వినిపించేది వీరే. ఆ బ్యాండ్ వ్యవస్థాపకుడు మస్తాన్ సాహెబ్. ఈయన మేనల్లుడు మీరాసాహెబ్. దీర్ఘకాలంగా బ్యాండ్ సంగీతంలో కొనసాగారు. మస్తాన్ సాహెబ్ కొడుకు పెద బాజీ కూడా బ్యాండ్ మాస్టర్‌గా, సినీ ఆర్కెస్ట్రా ప్రోగ్రాములతో బిజీగా ఉండేవారు. మీరా సాహెబ్ కుమారుడు ఎస్‌కే బాజీకి చిన్నతనం నుంచి సంగీతంతో అనుబంధముంది. పెద బాజీ వద్ద కీబోర్డు సాధన చేశాడు. రాగాలు నేర్చుకునే క్రమంలోనే టెన్త్ క్లాస్ చదువుకు స్వస్తి పలికాడు. కొన్నేళ్లు అదే ట్రూపులో పనిచేశాడు. చెన్నైలో స్నేహితుడు నరేష్ దగ్గర రికార్డింగ్ నేర్చుకున్నాడు. తెనాలి వచ్చాక ఇక్కడే మ్యూజిక్ స్టూడియో ఏర్పాటు చేసుకుని ఆధ్యాత్మిక ఆల్బమ్స్ చేయటం ఆరంభించారు. కొన్ని షార్ట్ ఫిల్మ్, 'రా...కిట్టూ' వంటి కొన్ని లోబడ్జెట్ సినిమాలనూ పనిచేశారు. విజయవాడలో రేడియో మిర్చి కోసం కొన్ని ఆల్బమ్స్ రూపొందించగా, అవి నచ్చటంతో హైదరాబాద్ నుంచి పిలుపొచ్చింది. ఒక నెల పని కోసమని 2016లో అక్కడకు వెళ్లిన బాజీకి వరుసగా పని దొరికింది. నెలల తరబడి హైదరాబాద్ – తెనాలి మధ్య తిరుగుతుంటే పెద్దలు అభ్యంతర పెట్టారు. హైదరాబాద్‌లోనే స్థిరపడమన్నారు. అప్పటికే పెళ్లయి, అయిదు నెలల పాప ఉంది. 'ఫ్యామిలీని తీసుకుని వెళ్లి ఉండగలనా... అనుకుంటూ బయలుదేరాను. హైదరాబాద్ సంగీత ప్రపంచం నన్ను అక్కున చేర్చుకుంది' అని బాజీ చెప్పారు.

రోప్ స్కిప్పింగ్‌లో తాడేపల్లి విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలోని గీతాంజలి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో సత్తా చాటారు. గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా శనివారం స్కూల్ కరస్పాండెంట్ రమాదేవి వారిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ... ఇండియన్ రోప్ స్కిపింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు గోవాలో జాతీయ స్థాయి పోటీల్లో టి. హేమ శివశంకర్, సీహెచ్ మోక్ష అండర్ – 10 విభాగంలో స్పీడ్ డబుల్ అండర్ ఫ్రీ స్టైల్ కేటగిరీలో గోల్డ్ మరియు సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు పి. తిరుపతిరావును అభినందించారు.



విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న కరస్పాండెంట్ రమాదేవి

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

- జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్
- తెనాలి పట్టణంలో పర్యటన

తెనాలి రూరల్: పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మెగా పేరెంట్స్ – టీచర్స్ మీటింగ్‌లో పాల్గొనేందుకు ఉదయం పట్టణానికి వచ్చిన ఆయన పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న టూ టౌన్ స్టేషన్, టౌన్ స్టేషన్ పరిధిలో క్వార్టర్స్‌ను పరిశీలించారు. వాటి పరిస్థితి గురించి డీఎస్పీ బి. జనార్దనరావును అడిగి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. గాంధీ చౌక్, శివాజీ చౌక్ ప్రాంతాల్లో పర్యటించారు. నడుచుకుంటూ వెళ్లి ఆయా మార్గాల్లో ట్రాఫిక్ రద్దీని పరిశీలించారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని పరిశీలించి ఏం చేస్తే బాగుంటుందో చర్చించామన్నారు. సీసీ కెమెరాల వల్ల క్రైం రేట్ తగ్గుతుందని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో 50 చొప్పున కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రౌడీషీటర్లకు ప్రతి వారం కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ సమస్యలు పరిష్కరిస్తామని వెల్లడించారు. పర్యటనలో డీఎస్పీ బి.జనార్దనరావు, సీఐలు వి. మల్లికార్జునరావు, రాములు నాయక్, ఎస్. రమేష్‌బాబు, బెల్లం శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

తెనాలి రూరల్: ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రతి విద్యార్థి దాన్ని సాధించేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ అన్నారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం చెంచుపేటలోని కేఎస్ఎం హైస్కూల్‌లో శనివారం ఉదయం నిర్వహించారు. దీనికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యాశాఖ, మున్సిపల్ అధికారులతో కలిసి పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్‌కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వాటికి దూరంగా ఉంటామని, చెడు వ్యవసనాలకు బానిస కాబోమంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సభలో ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎంఈవో వి. జయంతి బాబు, డీఎస్పీ బి జనార్ధనరావు, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు, ఎస్ఐ ప్రకాశరావు, కౌన్సిలర్లు మానసా రెడ్డి, బోయపాటి అరుణ, కొమరాబత్తుని జయపాల్, ప్రముఖులు కొత్త సుబ్రహ్మణ్యం, రావి భగత్‌దత్తు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

COACHING

■ లాంగ్ టర్మ్ కోచింగ్ ఫర్ (EAPCET-2025 AP & TS) అత్యుత్తమ ఫ్యాకల్టీచే విద్యా బోధన హాస్టల్ వసతి కలదు. ఇంటర్ ట్యూషన్ చెప్పబడును. సంప్ర॥ శ్రీ దివ్య ఇనిస్టిట్యూట్స్, 2/13, అరండల్‌పేట, గుంటూరు. 73967 55801

REAL ESTATE

■ గుంటూరుసిటీ అంకిరెడ్డిపాలెంNH-16 & ఇన్నర్ రింగ్‌రోడ్ జంక్షన్ హైవే గార్డెన్స్‌లో గ॥18500, హౌసింగ్ బోర్డ్ ఎక్స్‌టెన్షన్ కొత్త హౌస్-50ల॥, అగతవరప్పాడు 3ఫ్లోర్స్‌హౌస్75ల॥ 9966960009

■ గుంటూరులో కమర్షియల్ మరియు రెసిడెన్సియల్ ఇళ్ళు, స్థలాలు, పొలాలు, ప్లాట్లు అమ్మదలనా, కొనదలనా సంప్రదించగలరు. 6281494079

■ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజ మరెక్కడైనా ప్లాట్స్ అ/కొ సంప్ర॥ జనచైతన్య మా ప్రత్యేకత. 7382396677

FLAT FOR SALE

■ గుంటూరు, డొంకరోడ్డు, కాకుమానువారితోట 4వలైను, నందు గల పూర్ణిమ గోల్డ్ అపార్ట్‌మెంట్ 5వ ఫ్లోర్‌లో 1880/- Sft 3BHK Full Finshing Flat అమ్మకమునకు కలదు. 9642388499

■ గుంటూరు సిద్ధార్థనగర్ 1/2 స్కేటింగ్ గ్రౌండ్ Opp. KLP School గ్రావెల్ ఎన్‌క్లేవ్ Ready to Move 3 BHK 2050 Sft ఫుల్ ఫినిష్ & సెంట్రల్ A.C ✆ 8897393868, 9000183217

■ VIP ROAD CHUTTUGUNTA. 2BHK FLAT 1100 SQFT, W/F, FULLY FURNISHED, MUNICIPAL WATER,CAR PARKING READY TO OCCUPY. 9000002003

■ వర్ధిక నివాస్: ఇన్నర్‌రింగ్‌రోడ్ రైల్వే గేట్ దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2 BHK ఫుల్ ఫినిష్ లగ్జరీ ఫ్లాట్స్ 42 లక్షలకే. ఫోన్: 9848110543, 8885566086

HOUSE FOR SALE

■ GMC పరిధిలో ORRకు దగ్గరలో, పొత్తూరు ACMI గ్లోబల్ స్కూల్ దగ్గర 117 చ.గ.లలోని ఇండిపెండెంట్ హౌస్ అమ్మబడును. మరియు 1700 చ.గ. స్థలం అపార్ట్‌మెంట్ నిర్మాణం కొరకు డెవలప్‌మెంటుకు ఇవ్వబడును. 9966666034, 7396704509

■ GUNTUR,Naidupet, EAST Face Building 74 SQ Yards.(G+1) 15000 per Month Rents, price -78L,Only-7989925231 / 8125564777

LAND FOR SALE

■ బాపట్ల బైపాస్‌కి దగ్గరలో 52 సెంట్ల స్థలం ఒకే Bit అమ్మబడును. సంప్ర॥ ఆర్.సి.రెడ్డి. Cont: 9885234290, 7842666538

■ అమరావతిలో క్రోసూరు రోడ్డుకి అంటిలో మీటరు దూరంలో 4 అడుగుల డొంక ఫేసింగ్ పొలము అమ్మకానికి కలదు. ఎకరం ధర 1.50 లక్షలు. 9177546316

■ అమరావతి రాజధాని పరిధిలో కంతేరు నుండి తాడికొండ వెళ్ళు రహదారికి సమీపంలో డొంకరోడ్ ఫేసింగ్‌లో 1/2 ఎకరం భూమి అమ్మకమునకు కలదు. సంప్ర. 99592 43663

OLD BUILDINGS

■ పాతబిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకులషెడ్‌లు, పగలగొట్టబడును. పాత కలప, కిటికీలు, పాత ఐరన్ కొనబడును. సంప్ర॥ 9703290782, 9700442419

PLOT FOR SALE

■ 450 ఎకరాల వెంచర్ నందు 11 సెంట్లు భూమి కేవలం రూ. 5,00,000/- మాత్రమే స్పాట్ రి. ఆకాపో ఫ్రూట్ పై ప్రతీ సం.లక్షల్లో ఆదాయం. గుంటూరు నుండి గంట ప్రయాణం. 83175 28192

■ గుంటూరు మున్సిపాలిటీలో గల ఏటుకూరు ఆనుకొని 100 అడుగుల రోడ్డు ఫేసింగ్ తక్షణమే గృహ నిర్మాణానికి అనువైన ప్లాట్లు కలవు. 1 గజం 6000 రూపాయలు. 70979 72927

■ గుంటూరు, [illegible] కలదు. ✆ 9397176039

■ రాజా బోలేగేట్ దగ్గర మరియు తాడికొండ x రోడ్స్ - పొన్నెకల్లు మెయిన్ రోడ్డు ఆనుకొని 40 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ / CRDA అప్రూవ్/ఓపెన్ ప్లాట్లు కొరకు. 9701486924

TO-LET

■ గుంటూరు GT రోడ్ రమేష్ హాస్పిటల్ వెనుక 28500 చ.అ. కమర్షియల్ 5 అంతస్తుల నూతన భవనం సెల్లార్ పార్కింగ్ అన్ని సౌకర్యాలతో ఉన్న బిల్డింగ్ హాస్పిటల్‌కు, హోటల్స్‌కు, కాలేజీలకు, స్కూళ్లకు అద్దెకి ఇవ్వబడును. 9866132826

■ తెనాలి నాజరుపేటలో 1st ఫ్లోర్ లోని ఫ్లాట్ నెం. 103 నందు 2BHK కారు పార్కింగ్‌తో అన్ని వసతులు గల ఫ్లాటు అద్దెకు కలదు. ఫోన్. 9177350995

TO - LET COMMERCIAL

■ PG/ హాస్టల్‌కు అద్దెకు కలదు. గుంటూరు పట్టాభిపురంలో 500 sq.yard లో గల భవనము 19 రూమ్స్‌తో PG/ హాస్టల్ కొరకు అద్దెకు కలదు.✆7981670283, 7780352826

SERVICES

ASTROLOGY

■ మీ ఇల్లు చూసి అంతాలోటి వాస్తు మార్పులు చెప్పబడును. కొత్త ఇంటి ప్లానులు 100% గ్యారంటీ ఇవ్వబడును. మీ ఇల్లు పూర్తయ్యే వరకు అందుబాటులో ఉండగలము. పరిశోధన అనుభవము గల వాస్తుశాస్త్ర నిపుణులు గౌరువాస్తు మునియ్య. Ph: 96409 64570

HEALTH CARE

■ త్రాగుడు మాన్పించండి, త్రాగేవారికి తెలియకుండానే, అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కొబ్బరికల్ కేరళ మందులతో వైద్యం. సంప్ర॥ ✆9440870099

OLD AGE HOME

■ 16సం॥ [illegible] పల్నాడు జిల్లా.

PEST CONTROL

■ చెదపురుగులు, బొద్దింకల నివారణ కొరకు గ్యారంటీ AN ISO 9001-2015 సర్టిఫైడ్ కంపెనీ లాన్సర్ పెస్ట్ కంట్రోల్ పట్నంబజార్, గుంటూరు. 8978872824, 9848131213

SECOND SALE

■ స్కూల్ మరియు కాలేజీలకు అవసరమైన విద్యార్థులు క్లాసు రూమ్‌లో చదువుకునే మంచి నాణ్యమైన పాత బెంచీలు అమ్మబడును. కావలసిన వారు సంప్రదించగలరు. ఫోన్ : 9100089416

WANTED

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు మంగళగిరి కాజా, గుంటూరు, బుడంపాడు, నల్లపాడు ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. 9666618811, 9666618877

■ తెనాలిలోని మ్యారేజ్‌బ్యూరో ఆఫీస్ నందు పని చేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్స్-2 కావలెను. అ: 10th-డిగ్రీ, జీ:5000/- T:10am-8pm తెనాలి లోకల్ వారికి ప్రాధాన్యత. సంప్ర: 7989021063

■ సైట్ సూపర్‌వైజర్స్ కావలెను. బిల్డింగ్ కన్స్ట్రక్షన్ నందు కనీసం రెండు సంవత్సరాలు అనుభవం ఉండవలెను. మ్యారేజ్ అయి ఉండవలెను. విద్యార్హతలు: బిటెక్ సివిల్ చేసి ఉండవలెను. జీతం: 15000/- నుండి 25000/- వరకు ఇవ్వబడును. పనిచేయు స్థలం: మార్కెట్‌మెంట్ గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 89784 80435

■ గుంటూరులో పనిచేయుటకు ఆటోడ్రైవర్లు డెలివరీబాయ్స్, ఏరియా వారీగా కమిషన్ బేసిక్‌పై లైన్ సేల్స్‌మెన్,హాకర్స్ కావలెను.TVS XL వున్న వారికి ప్రాధాన్యత.8142099909, 9032280008

■ సూపర్‌వైజర్స్(M), Q:B.Tech ఎలక్ట్రికల్, PRO(M), Q: MBA/MCA, 35 to 40 లోపు తెనాలి ఆటోనగర్‌లోని ప్రముఖ కం॥ కొరకు నం॥ 9490157852, 7815829957

■ నరసరావుపేట యలమందలో పనిచేయుటకు X ఆర్మీ కావలెను. 8 గం. 15000/- 12 గం. 20000/- & సెక్యూరిటీ గార్డులు 12 గం.కి 10500/- PF, ESI రూమ్ సౌకర్యం, సబ్సిడీపై భోజనం కలదు ✆ 73866 88787

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ నందు గుంటూరులో పనిచేయుటకు కారుడ్రైవర్లు, లేడి టెలికాలర్స్, లేడి రిసెప్షనిస్ట్, ఆఫ సువామసువ, మార్కెటింగ్ సిబ్బంది కావలెను. 7731951999

■ విజయవాడలో [illegible] 9, 9885025559

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్. ✆ 91332 71122, 95534 61177

■ శ్రీనివాస గ్రూపు, (వాగోల్, హైదరాబాద్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు 10th ఆపైన చదివిన 20-30 సం. వయస్సు గల M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 99636 91122, 92814 65315

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 15-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ - విజయవాడ) బ్రాంచీల కొరకు బైక్ మెకానిక్స్ వెంటనే కావలెను. భోజనం+ వసతి + జీతం: 20-30,000/- ✆ 94406 71190

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- 10th to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. 9036993713

■ స్టోర్ కీపర్స్ కావలెను. అర్హతలు: ఒకటి లేదా రెండు సంవత్సరములు మెస్‌లో స్టోర్ కీపర్‌గా అనుభవం కలిగి ఉండాలి. విద్యార్హత: B.Com, జీతము : 15,000/-రూ॥లు, జీతంతో పాటు ఉచిత వసతి మరియు భోజనం సౌకర్యం కలదు. పని చేయుస్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 8978480429

■ గుంటూరు నందు గల మా సంస్థ శ్రీ బాలాజీ హోం నీడ్స్ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. శాలరీ: 8000+ ఇన్సెంటివ్స్, అడ్రస్: సిటీ మార్కెట్. 8178243779, 9642881048

■ రామట్రెస్స్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన సేల్స్‌బాయ్స్& సేల్స్‌గర్ల్స్ కావలెను. టైలర్, ఐస్త్రీకర్ స్టిచ్చర్ కూడా కావలెను.మంచిజీతం. రఘు మేన్షన్ 5/1 బ్రాడీపేట,గుంటూరు. ✆ 9391379724

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, బోర్స్ డ్రైవర్స్-3, హెల్పర్స్-5, 30 సం.లోపు జీతం: 18&25,000/- భోజనం/వసతి ఫ్రీ ✆ 91771 77244

■ Looking for 1-4yrs Sales and Marketing experience profiles in Paints Industry. Working across AP & TS. VG Paintings Industry. Contact: 9494998833.

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ. 18K. Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ. 100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
(పై ప్రకటనకు G.S.T. 5% అదనం)
ఈ పేజీలలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలను చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శాంతి స్వరూప్

కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ కమిషనరేట్ యూనిట్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శాంతి స్వరూప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కృషీ భవన్‌లో శనివారం అసోసియేషన్ కమిషనరేట్ యూనిట్ సర్వసభ్య సమావేశం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడుగా శాంతి స్వరూప్, కార్యదర్శిగా మణి కుమారి, కోశాధికారిగా షాబుద్దీన్, ఉపాధ్యక్షులుగా అన్నం శ్రీనివాస రావు, ప్రసాద్ బాబు, లోకేష్, అశ్వర్థ నారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సునీల్ యాదవ్, జాయింట్ సెక్రటరీలుగా సత్యనారాయణ, శ్రీహరి రావు, దూండీశ్వరరావు, సభ్యులుగా ఎలీషా, అనీల్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఎం.వెంకటేశ్వరరావు, వెన్నా రమేష్, పరిశీలకునిగా డీఎస్ఎన్ శ్రీనివాస్ వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తామని కార్యవర్గం తెలిపింది. కార్యక్రమంలో ఏపీ అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి కుమార్, ప్రధాన కార్యదర్శి రవి కుమార్, కోశాధికారి శ్యామ్ సుందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కృష్ణా, ప్రకాశం, గుంటూరు జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కుకు రేపటి వరకు గడువు

నరసరావుపేట: గుంటూరు, కృష్ణా శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల జాబితాలో ఓటు కోసం ఈ నెల తొమ్మిదవ తేదీలోగా ఫారం- 18ను సమర్పించి పేరు నమోదుచేసుకోవాలని ఎన్నికల అధికారి పర్యవేక్షకులు షేక్ ఖాజావలి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను గత నెల 23న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించామని తెలిపారు. ఈనెల 6వ తేదీ వరకు వచ్చిన క్లెయిములను విచారించి, అర్హత కలిగిన అర్జీదారులను డ్రాఫ్ట్ జాబితాలో ఓటర్లుగా నమోదు చేశామని పేర్కొన్నారు. జాబితాను డీఆర్వో, తహసీల్దార్ల కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు.

నర్సింగ్ ఉద్యోగావకాశాలు

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీ), ఓఎంసీఏపీ, క్యూరా పర్సనల్ సంయుక్తంగా జర్మన్ భాషలో శిక్షణతో పాటు ఆ దేశంలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి తమ్మాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఏఎం, బీఎస్సీ నర్సింగ్ అర్హతతో పాటు వయస్సు 35 సంవత్సరాలలోపు ఉండాలని పేర్కొన్నారు. దీంతో పాటు బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి రెండేళ్లు, జీఏఎం చదివిన వారికి మూడేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. అభ్యర్థులు జర్మనీలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఆరు నెలలు పాటు గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు. జర్మన్ భాషలో శిక్షణ ఏ1, ఏ2, బీ1, బీ2 స్థాయిలుంటాయని పేర్కొన్నారు.కాషన్ డిపాజిట్‌గా రూ.75వేలు లేదా ఒరిజినల్ సర్టిఫికెట్లు క్యూరాపర్సనల్ వారికి సబ్మిట్ చెయ్యాలని తెలిపారు. విజయవంతంగా ముగించిన అభ్యర్థులకు డిపాజిట్ తిరిగి చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ రెసిడెన్షియల్, డేస్కాలర్స్‌లో ఉంటుందన్నారు. భోజనం, వసతితోపాటు ట్రాన్స్‌లేషన్ రుసుం అభ్యర్థులే చెల్లించాలని తెలిపారు. వీసా వచ్చిన తర్వాత వారు తిరిగి చెల్లిస్తారన్నారు. బీ2 పరీక్ష ఫీజు మొదటి సారిగఅభ్యర్థులు చెల్లించాలని వెల్లడించారు.

మద్యం మత్తులో ఇల్లు తగలబెట్టిన ప్రబుద్ధుడు

తాడేపల్లి రూరల్ : ఓ ప్రబుద్ధుడు మద్యం మత్తు ఎక్కువై భార్యతో గొడవపడి ఇంటికి నిప్పుపెట్టాడు. ఈ సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... తాడేపల్లి నులకపేటలోని రామయ్య కాలనీలో కూలీ పనులు చేసుకుంటూ బడేబాబు, ఆయన కుటుంబం ఉంటోంది. శనివారం సాయంత్రం దంపతులు గొడవ పడ్డారు. భార్యను కొట్టిన బడేబాబు ఆమెతోపాటు పిల్లలను కూడా బయటకు నెట్టివేశాడు. మద్యం మత్తులో ఇంటికి నిప్పు పెట్టాడు. బట్టలు, వస్తువులతో పాటు రేకుల షెడ్డుకు మంటలు అంటుకున్నాయి. భార్య, పిల్లలు కేకలు వేయడంతో స్థానికులు, కార్పొరేషన్ వాటర్ వర్క్స్ ఇంజినీరింగ్ సిబ్బంది సోలా ఆంజనేయులు లోపల ఉన్న బడేబాబును బయటకు తీసుకువచ్చారు. స్థానికుడు ఉపేంద్ర, మరికొంతమంది యువకులు పక్కనే ఉన్న విద్యుత్ మోటారు ద్వారా నీటిని చల్లి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. మంగళగిరి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను పూర్తిస్థాయిలో ఆర్పారు.



నివాసంలో మంటలు

దళారుల నుంచి రైతులను కాపాడాలి

జేసీ గనోరేకు రైతు సంఘ నాయకుల వినతి

నరసరావుపేట:. ధాన్యం కొనుగోలు సెంటర్లు వెంటనే ప్రారంభించి ధాన్యం బోకర్ల నుంచి రైతుల్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము కోరారు. గత ఏడాది ఈపాటికే ప్రభుత్వం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసి బస్తాను రూ.2200 కొనుగోలు చేసిందని తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం బస్తాను ప్రభుత్వమే కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించినా ఇప్పటివరకు ఆచరణకు నోచుకోలేదని తెలిపారు. ఇప్పటికే చాలామంది రైతుల ఇళ్లకు ధాన్యం వచ్చి ఉందని, ప్రభుత్వం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయక పోవడంతో బోకర్ల మాయలో పడి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ధాన్యం బోకర్లు రైతులను మభ్యపెట్టి బస్తాను రూ.1500ల లోపే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసినట్లయితే దళారీ వ్యవస్థ నుంచి రైతుల్ని కాపాడిన వారు అవుతారని వివరించారు. రైతుల ఆరుగాలం కష్టందోపిడీకి గురికాకుండా అరికట్టిన వారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, సీనియర్ నాయకుడు రంగయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జేసీ గనోరేకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ, రైతు సంఘ నాయకులు

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

నరసరావుపేట: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని పార్టీ ప్రతినిధులకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సీహెచ్.బాబూరావు పిలుపు ఇచ్చారు పార్టీ పల్నాడు జిల్లా 25వ మహాసభలు శనివారం పట్టణంలోని ప్రకాష్‌నగర్ షాదీఖానాలో జమండ్లమూడి లింగరావునగర్, బొల్లు శంకరరావు ప్రాంగణంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభసూచికగా సభా ప్రాంగణంలో సీనియర్ నాయకులు ఏవీకె దుర్గారావు పార్టీ జెండా ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద ఇటీవల మృతి చెందిన అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి, సీనియర్ కామ్రేడ్ బొల్లు శంకరరావు, కామ్రేడ్ జమండ్లమూడి లింగరావు చిత్రపటాలకు రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, కె.హరికిశోర్, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ, జి.రవిబాబు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, ఎస్.ఆంజనేయనాయక్, పట్టణ కార్యదర్శి డి.శివకుమారి, 1వ, 2వ పట్టణ కార్యదర్శులు షేక్ సిలార్‌మసూద్, సయ్యద్ రబ్బాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు